జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

మంగళవారం | 16-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 538 పేజీలు: 4 వెల : రూ.7

## పోలీసుల ఆంక్షలు.. నిర్బంధాల నడుమ..



# యజ్ఞంలా కోటి సంతకాల ఉద్యమం





* కోటి సంతకాల వాహనాన్ని, నేతలను అడ్డుకున్న పోలీసులు * పలుచోట్ల వాగ్వాదాలు, తోపులాటలు, నిరసనలు * ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వరకూ భారీగా సాగిన కోటి సంతకాల యాత్ర * నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరన్న వైసీపీ నేతలు * యాత్రకు భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు





**శ్రీకాకుళం, డిసెంబర్ 15 (వార్త):** మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌పరం చేయడాన్ని నిరసిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమం శ్రీకాకుళం జిల్లాలో ఓ యజ్ఞంలా సాగింది. జిల్లాలో దాదాపు ఐదు లక్షల మంది సంతకాలు చేశారు. ఈ ప్రతులను తాడేపల్లికి తీసుకువెళ్లేందుకు సోమవారం ఇచ్ఛాపురం నుంచి బయలుదేరిన వాహనం శ్రీకాకుళం చేరుకుంది. ఈ వాహనంతో పాటు పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు బారులు దీరారు. ఈ వాహనంతో పాటు పార్టీ నేతలు, శ్రేణులు ముందుకుకదలకుండా పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. జాతీయ రహదారిపై బారికేడ్లు పెట్టి, టోల్‌గేట్లు వద్ద వాహనాలు అడ్డుపెట్టి, ఆంక్షలు విధించినా పార్టీ శ్రేణులు వాటన్నింటిని అధిగమించి ముందుకుసాగారు. పలుచోట్ల వైసీపీ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాటలు కూడా చోటుచేసుకున్నాయి. ఇచ్ఛాపురంలో జాతీయ రహదారిపైకి వైసీపీ నాయకులతో పాటు జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ వాహనం రాగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పోలీసులు వదిలిపెట్టక తప్పలేదు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు తదితర నాయకులను జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు అడ్డంగా పెట్టి నిలువరించే ప్రయత్నం చేశారు. టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్ తదితరులు వస్తున్న వాహనాలను మడపాం టోల్‌గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తిలక్ టోల్‌గేట్ వద్ద నిరసన తెలియజేశారు. ఆమదాలవలసలో భారీ ర్యాలీగా వస్తున్న పార్టీ సమన్వయ కర్త చింతాడ రవికుమార్‌తో పాటు నాయకులను పార్టీ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అలాగే కొత్తరోడ్డు జంక్షన్ వద్ద, సెవెన్ రోడ్డు జంక్షన్ వద్ద పోలీసులు అడ్డుకోగా, ట్రాఫిక్ జామ్ అయింది. నరసన్నపేట నియోజకవర్గం నుంచి శ్రీకాకుళం వెళుతున్న ధర్మాన కృష్ణదాస్, కృష్ణచైతన్యలను పోలీసులు మడపాం టోల్‌గేట్ వద్ద అడ్డుకున్నారు. దీంతో వారంతా బైక్‌లపై ర్యాలీగా శ్రీకాకుళం తరలివచ్చారు. అరసవిల్లి జంక్షన్ వద్ద మళ్లీ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు బైక్‌లను అక్కడే వదిలిపెట్టి పాదయాత్ర చేస్తూ శ్రీకాకుళం టౌన్ హాల్ వరకూ ర్యాలీ చేశారు. జిల్లాలో 4 లక్షలకు పైగా సేకరించిన కోటి సంతకాల పత్రాలతో బయలుదేరిన వాహనాన్ని శ్రీకాకుళంలోని టౌన్ హాల్ వద్ద వైసీపీ నేతలు ధర్మాన కృష్ణదాస్, ప్రసాదరావు, తమ్మినేని సీతారాం, సీదిరి అప్పలరాజు, కుంబా రవిబాబు, పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, రెడ్డి శాంతి తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీని పెద్ద మార్కెట్ మీదుగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, ఏడు రోడ్ల కూడలికి, పాతబ్రిడ్జి, నవభారత్ జంక్షన్ మీదుగా తాడేపల్లి పార్టీ ప్రధాన కార్యాలయానికి కోటి సంతకాల ప్రతుల వాహనం వెళ్లింది. చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన నినాదాలతో ర్యాలీ దద్దరిల్లిపోయింది. అంతకుముందు టౌన్ హాల్‌లో భారీ సమావేశం జరిగింది. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. కృష్ణదాస్ మాట్లాడుతూ చంద్రబాబు తప్పుడు విధానాల వల్ల ప్రజలకు నష్టం జరుగుతుందన్నారు. సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయడం వల్ల సామాన్య, పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. తమ్మినేని సీతారాం మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణకు వచ్చిన స్పందన చూసి తట్టుకోలేక కూటమి ప్రభుత్వం కుట్రలకు దిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు నర్తు రామారావు, పాలవలస విక్రాంత్, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, ఆరంగి మురళి, దుంపల లక్ష్మణరావు, శాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, గొండు కృష్ణమూర్తి, చల్ల రవి, ఎంవీ పద్మావతి, కరిమి రాజేశ్వరరావు, పిరియా సాయిరాజ్, పార్టీ శ్రేణులు భారీగా పాల్గొన్నారు.



## మత్తురహిత సమాజానికే..

# అభ్యుదయం సైకిల్ యాత్ర




* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి * పైడిభీమవరం చేరుకున్న యాత్ర * ఘన స్వాగతం పలికిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే, జేసీ, పోలీసులు

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 15 (వార్త):** గంజాయి, మత్తు పదార్థాలు లేని సమాజమే లక్ష్యంగా, ప్రజలకు చైతన్యం కల్పించేందుకు పోలీసు శాఖ ఈ అభ్యుదయం సైకిల్ యాత్రను నిర్వహిస్తోందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకూ ఈ ర్యాలీ సాగుతుందని తెలిపారు. సోమవారం ఈ ర్యాలీ శ్రీకాకుళం జిల్లా ముఖద్వారమైన పైడిభీమవరంనకు చేరింది. ఈ అభ్యుదయం సైకిల్ ర్యాలీకి ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి ఎస్పీ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పాయకరావుపేట నుండి ఇచ్ఛాపురం వరకు మాదకద్రవ్యాలు వద్దు - గంజాయి అక్రమ రవాణాను నిరోధిద్దాం అనే నినాదాంతో ఈ ర్యాలీ సాగుతోందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన, వాటి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో చైతన్యం, అవగాహన కల్పిస్తూ సాగుతున్న ర్యాలీకి మంచి స్పందన వస్తోందని చెప్పారు. విశాఖపట్నం రేంజ్ పరిధిలో సుమారు 1000 కిలోమీటర్లు, ఐదు జిల్లాల్లో 25 మంది పోలీస్ సిబ్బందితో ఈ యాత్ర చేస్తున్నారన్నారు. మార్గమధ్యంలో పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, ముఖ్య కూడళ్ల వద్ద ప్రజలకు మాదకద్రవ్యాల అక్రమ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసై తమ అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఉన్నత లక్ష్యాలు సాధించుకునే అవకాశం మీ చేతుల్లోనే ఉందని తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం లేదా అక్రమ రవాణాలో పట్టుబడితే ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని హెచ్చరించారు. గంజాయి సంబంధిత సమాచారం 1972 టోల్ ఫ్రీ నెంబర్, స్థానిక పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి డీజీపీ ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలన కోసం ఈ సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కుటుంబాలు ఎదుర్కొనే బాధను గుర్తుచేస్తూ, యువత మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, హెల్త్ శాఖల సమన్వయంతో పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి సమాజానికి పెద్ద ప్రమాదమని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రణకు చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. పోలీస్ శాఖ గంజాయి నియంత్రణకు నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి నైపుణ్యాలు పెంపొందించుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ హెచ్. వివేకానంద, సీఐ ఎం.అవతారం, డి.సి.ఎం. చైర్మన్ అవినాష్, ఇతర పోలీసు అధికారులు, ఈగల్ టీమ్ సభ్యులు, పరిశ్రమల సిబ్బంది, స్థానిక ప్రజలు, విద్యార్థులు, మహిళలు, కార్మికులు, రాజకీయ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## బీజేపీలో పలువురి చేరిక

**మందస, డిసెంబరు 15(వార్త):** భారతీయ జనతా పార్టీలో పలువురు చేరారు. మందస పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో లాయర్, సీనియర్ నాయకుడు కృష్ణమోహన్ సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. భారతీయ జనతా పార్టీ అనుసరిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, దేశ భద్రత, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై మండలంలోని కొన్ని పంచాయితీల నుంచి కార్యకర్తలు బిజెపిలో చేరి, భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం, పివిఎన్ మాధవ్ నాయకత్వంలో రాష్ట్రం మరింత ముందడుగు వేయడానికి మేమంతా సహకరించి, సేవ చేయడానికి భారతీయ జనతా పార్టీలో చేరామన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో దేశభద్రత, మన దేశ భవిష్యత్తుకు మార్గ నిర్దేశం చేసే ఒక ఆర్థిక దౌత్యపరమైన ప్రస్థానానికి ప్రారంభమని, మనందరిది ఒకటే మంత్రం ఒకల్ ఫర్ లోకల్.. ఒకటే మార్గం ఆత్మ నిర్భర్ భారత్ ఒకటే లక్ష్యమని, వికసిత్ భారత్ కావాలంటే స్వదేశీ స్వాభిమానం, స్వలంబన దశగా మనమంతా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు రౌతు చిరంజీవి, ఇప్పిలి వెంకటరావు, తెలుకుల సురేష్, రట్టి లక్ష్మణ్ కుమార్, రామారావు, డొక్కరి పున్నయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి, సంక్షేమం కూటమితోనే సాధ్యం



**జి.సిగడాం, డిసెంబరు 15(వార్త):** గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టిడిపి సీనియర్ నాయకులు మండల సమన్వయకర్త టంకాల మౌళీశ్వరరావు తెలిపారు. సోమవారం టంకాల దిగ్గువలస గ్రామంలో విలేఖర్లుతో అయెన మాట్లాడారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తోనే ఎచ్చెర్ల నియోజకవర్గ అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి చేయాలంటే పంచాయతీ నిధులు ఒక్క రూపాయి కూడా ఉండేవి కాదని, కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లిన దాఖలాలు లేవని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామాల అభివృద్ధి రైతుల సంక్షేమం లక్ష్యంగా సాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. వారితో పాటు సర్పంచ్ మహాదాస్యం చిన్నారావు, కూటమి నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

## అర్హత గల సంఘాలకు అన్ని సదుపాయాలు




**సోంపేట, డిసెంబరు 15(వార్త):** అర్హత గల స్వయం శక్తి సంఘాలకు అన్ని సదుపాయాలను కల్పించాలని ఏపి ఎం ఎస్ ప్రసాదరావు సూచించారు. సోంపేట క్లస్టర్ సీసీ లెవెల్ సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపి ఎం మాట్లాడుతూ అర్హత కలిగిన సంఘాలకు బ్యాంకు లింకేజీ శ్రీనిధి సామాజిక పెట్టుబడినిధి, ఉన్నతి, అంతర్గత పొదుపు అప్పు మొదలైనవి కల్పించాలని సూచించారు. పాపారావు నాయుడు లీడర్లు పాల్గొన్నారు.

## పోస్టల్ బాధితుల ఆందోళన



**ఇచ్ఛాపురం, డిసెంబరు 15(వార్త):** ఇచ్ఛాపురం పోస్టాఫీస్ లో జరిగిన స్కాం లో భాగంగా బాధితులు సోమవారం పోస్ట్ ఆఫీస్ వద్ద ఆందోళన చేపట్టారు. పోస్టల్ సిబ్బంది కార్యాలయంలోనికి వెళ్లకుండా గేటు వద్ద టెంట్ వేసి కూర్చున్నారు. పోస్టల్ ఉన్నత అధికారులు వచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. ఇప్పటివరకు పోస్ట్ ఆఫీస్ గేటు ముందరే నిరసన తెలిపారు. అయినా పోస్టల్ ఉన్నతాధికారులు, గాని స్థానిక పోస్టల్ అధికారులు ఎవరూ కూడా ఏ విధమైన హామీ ఇవ్వకపోవడంతో ఈ సమస్యకు పరిష్కారం దొరికే వరకు ఈ ఆందోళనను ఇలాగే కొనసాగిస్తామని బాధితులు తెలిపారు. రేపు కూడా ఇదే విధంగా గేటు ముందు నిరసన తెలియజేస్తాం అన్నారు.పోస్టల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ చేరుకుని నచ్చచెప్పే ప్రయత్నం చేసినా విఫలం కావడంతో రోజంతా పోస్ట్ ఆఫీస్ తెరుచుకోలేదు.

## స్కూల్ క్రిస్మస్ వేడుకలు




**ఇచ్ఛాపురం, డిసెంబరు 15(వార్త):** ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి లో సండే స్కూల్ క్రిస్మస్ ఘనముగా జరిగింది. సండే స్కూల్ సూపరెంట్ ప్రత్తి సోలోమీ, టీచర్స్ ఆధ్వర్యములో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ప్రత్తి విజయ్ కుమార్ , కార్యదర్శి మాచర్ల తాతాజీ ,వజ్రపు వెంకటేష్ , చుక్క ఢిల్లీ రావు లక్ష్మీనారాయణ , జోషి మాస్టార్ మరియు ఆంధ్ర ప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి అన్వేష్ పాల్గొన్నారు. ప్రత్యేక ఆటలు పాటలు నాట్యముతో పిల్లలు అలరించారు ప్రార్ధన కార్యక్రమాలు కేక్ కటింగ్ నిర్వహించారు.

## ఉద్యమాల వీరత్వం.. సీతారాం సొంతం

### -కామ్రేడ్ నర్తు మరణం ఉద్యమాలకు తీరని నష్టం

### -ఘన నివాళులర్పించిన నాయకులు

**మందస, డిసెంబరు 15(వార్త):** ఉద్యమాల వీరత్వం.. కామ్రేడ్ నర్తు సీతారాం సొంతమని సీపీఎం నాయకులు అన్నారు. ఇటీవల మరణించిన నర్తు సీతారాం కుటుంబాన్ని వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ నర్తు సీతారాం అకాల మరణం ఉద్యమాభిలాషులను కలిసివేచిందన్నారు. కిడ్నీ మహమ్మారికి బలైన కామ్రేడ్ సీతారాముల అమరత్వం ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. సీతారాం యువజన సంఘంలో విద్యనభ్యసిస్తున్న కాలంలోనే దోపిడి పోవాలని ఎర్ర జండా చెంతన చేరారని, అనాటి నుండి మరణించే వరకు ప్రజలు పక్షాన చేరి పోరాడిన వ్యక్తిగా నిలిచారన్నారు. సీపీఎం సభ్యుడుగా ఉన్నపుడే కిడ్నీ మహమ్మారికి గురయినప్పటికీ, కృంగిపోకుండా వ్యవసాయ కార్మిక సంఘంలో పని చేసి ఉపాధి కూలీ సమస్యలపై పోరాటం చేశారన్నారు. ప్రతీ విప్లవ కార్యకర్త సీతారాం నుండి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. సీతారాం సంస్మరణ సభ సందర్బంగా కుటుంబ సభ్యులచే నిర్మించనున్న స్తూప ఆవిష్కరణ ఈ నెల 21న ఉదయం 9 గంటలకు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో దాసరి తాతారావు, బమ్మిడి ఆనంద రావు, మట్ట ధర్మారావు, గణేష్ సాహు, మామిడి కోదండరావు తదితరులు ఉన్నారు.



# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### -ఎంఎల్ఏ గౌతు శిరీష

### -హరిపురంలో గ్రంథాలయం ప్రారంభం

### -మందసలో ప్రజా వినతుల స్వీకరణ



**మందస, డిసెంబరు 15(వార్త):** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పలాస నియోజకవర్గం శాసన సభ్యురాలు గౌతు శిరీషా అన్నారు. మందస మండలంలోని హరిపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.23లక్షలతో నిర్మించిన నూతన లైబ్రరీ బిల్డింగ్ ప్రారంభోత్సవ చేశారు. అనంతరం మందస ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో ప్రజల నుంచి వినతులు 33వినతులు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో శాసనసభ్యురాలు శిరీష మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందన్నారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. అర్హులందరికీ పథకాలను అందజేస్తామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామపంచాయతీలకు నిధులు పుష్కలంగా విడుదల య్యాయని, గత వైసిపి ప్రభుత్వ పాలనలో పంచాయతీలు అభివృద్ధి చెందకుండా నిర్వీర్యం చేశారని గ్రామపంచాయతీల్లో నిధులు స్వాహా జరిగాయని అన్నారు. కూటమి ప్రభుత్వం పంచాయతీలు అభివృద్ధికి మంజూరైనా నిధులతో పంచాయితీల నిధులు ఖర్చు చేయకుండా నిల్వ ఉంచుకుంటే నిధులు మురిగిపోయి నిధులు వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. సర్పంచుల మాట విని అభివృద్ధి పనులు చేపట్టకుంటే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవని అన్నారు మండలంలోని విఆర్వోలు పంచాయతీ కార్యదర్శులు రాజకీయాలకతీతంగా ఉద్యోగ విధులు నిర్వహించాలని కోరారు ఎవరికీ భయపడవద్దని తనకు నేరుగా పరిష్కారం కాని సమస్యలు తెలియజేయాలని కోరారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో సిమెంటు రోడ్లు తారు రోడ్లు డ్రైనేజీల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అభివృద్ధికి సహకరించాలని కోరారు మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులకు సంక్షేమ పథకాల అమలుకు సంపూర్ణ సహకారాన్ని అందించి పారదర్శక పాలన సాగించాలన్నారు. కార్యక్రమంలో మందస ఎంపీడీఓ వై. వెంకటరమణ, తహసీల్దార్ మిస్క శ్రీకాంత్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విటల్ రావు, పలాస ఏఎంసీ చైర్మన్ ఎం. శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, పార్టీ నాయకులు దాసరి తాతారావు, తమరియా భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, సాలిన మాధవరావు, భైరిశెట్టి గున్నయ్య, ఏర్పుల జోగారావు, కనగల తేజేశ్వరరావు, సింగుపురం వెంకటరావు, కొత్ర ఆనందరావు, కొత్ర వైకుంఠరావు, పుల్లా వాసు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు, పసుపురెడ్డి సందీప్, సర్పంచ్ పురుషోత్తం, ఎంపీటీసీ ఆనల అప్పన్న, ఎం.నవీన్ యాదవ్, ముంజేటి చంద్రశేఖర్, కృష్ణారావు, డుంకురు తిరుపతి, రాజాన మహేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలాస ఏపీఎన్జీజిఓ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశం



**పలాస, డిసెంబరు 15(వార్త):** పలాస పలాస ఎంపీడీవో ఆఫీసు నందు నూతనంగా ఎన్నికపడిన ఏపీఎన్జీజిఓ అసోసియేషన్ అధ్యక్షులు బోనేల గోపాల్, సెక్రెటరీ బి ఉపేందర్ రావ్ ఆధ్వర్యంలో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ అధికారి, సీనియర్ కామ్రేడ్ కొర్ల మన్మధరావు మాట్లాడుతూ సంఘ నిర్మాణంలో భాగంగా సభ్యత్వ నమోదు ప్రతి ఉద్యోగి దీనిలో భాగస్వామి కావాలని కోరారు. ఉద్యోగుల సంక్షేమము హక్కుల పరిరక్షణ కోసం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఎప్పుడు ముందంజలో ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పొట్నూరు. శ్రీనివాసరావు, పంచాయితీ అధికారి సద్గుణ బాబు, కోపరేటివ్ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్ పట్నాయక్, కమర్షియల్ టాక్స్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాలు, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ప్రగడగిరి, మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ ఉదయ శంకర్ పాత్రో, ట్రెజరీ అధికారి వాయిల పల్లి.త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయాలి



**మందస, డిసెంబరు 15(వార్త):** సీఐటీయు అఖిలభారత 18వ మహాసభలు జయప్రదం చేయాలని మందస, సిద్దూరు రైస్ మిల్లు జంక్షన్ వద్ద సీఐటీయు జెండాని సీఐటీయు జిల్లా కార్యదర్శి కడమట కేశవరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయు మండల కన్వీనర్ పి..దేవేంద్ర, మండల నాయకులు ఎం.ధర్మారావు మాట్లాడుతూ కార్మికుల రక్షణకై, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలుకై సీఐటీయు రాజీలేని సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాల్లో 29చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేసి 4లేబర్ కోడ్లను తెచ్చిందని, ఈ లేబర్ కోడ్లు కార్మికులకు తీవ్ర నష్టం చేస్తాయని వారన్నారు. వాటికి వ్యతిరేకంగా అనేక ఆందోళన పోరాటాలతో పాటు రోజుకు 8గంటల పని దినానికై, మహిళలపై వేధింపులు వంటి సమస్యలపై సీఐటీయు పోరాడుతుందని వారన్నారు. ప్రభుత్వ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలైన పిఆర్సి, సిపిఎస్ ఉద్యమాలకు, విద్యుత్ రంగ పరిరక్షణ, బ్యాంక్, ఎల్ఐసి వంటి సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వీఆర్ఏ లకు రెగ్యులరైజేషన్ సమస్యల పరిష్కారానికి చేస్తున్న పోరాటాలకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. సచివాలయ ఉద్యోగులకు, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు, కార్మికులకు అండగా నిలుస్తుందన్నారు. జీడి, రైస్ మిల్ పరిశ్రమలలో కనీస వేతనాలు, కార్మిక చట్టాల అమలకై నిరంతరం సిఐటియు పోరాడుతుందని కార్పొరేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై పోరాడుతున్నదని, రైతులకు అండగా గిట్టుబాటు ధరలపై కార్మిక, కర్షక ఐక్యతతో అనేక పోరాటాలకు సిఐటియు అండగా నిలుస్తుందన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా, ధరల పెరుగుదలకు, కరెంట్ చార్జీల పెంపు కు,స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరంతరం ఆందోళన నిర్వహిస్తున్న సిఐటియు అఖిలభారత మహాసభల జయప్రదానికై అన్ని వర్గాల ప్రజలు సహాయ సహకారాలు అందించి జనవరి 4వ తేదీన విశాఖపట్నం లో జరుగు ప్రదర్శన , బహిరంగ సభలలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాపారావు, గణేష్, కృష్ణ, లచ్చయ్య, ఏకాశి పాల్గొన్నారు.

## అపూర్వం.. అద్వితీయం

### -53 ఏళ్లకు పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

### - సందడిగా మారిన హరిపురం

**మందస, డిసెంబరు 15(వార్త):** వారంతా 60ఏళ్ల వయస్సు దాటిన వారు.. ఒకరినొకరు ఒరేయ్ ఎలా ఉన్నావురా.. బాగున్నావా.. పిల్లలు, మనుమలు ఏమి చేస్తున్నారు..? బీపీ, షుగర్ వంటి వ్యాధులు రాలేదు కదా.. అప్పటిలో మనం చేసిన అల్లరు, గురువులతో తిన్న తిట్లు, దెబ్బలు ఇంకా జ్ఞాపకాల మదిలో మెదులుతున్నాయిరా.. అంటూ తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సుమారు 65ఏళ్ల వయస్సులో కూడా ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. ఒకరికొకరు పలకరించుకుంటూ.. ఆలింగనం చేసుకుంటూ.. విద్యార్థుల్లా మారిపోయారు. హోదాలను మరచి.. ఎంతో ఆనందంగా గడిపారు. అంతేకాదు, వారి గురువులను కూడా సత్కరించారు. వివరాల్లోకి వెళ్తే.. మందస మండలంలోని హరిపురం ప్రాథమిక పాఠశాలలో 7వ తరగతి(1971-72) వరకు, అప్పటిలో గుడారిరాజమణిపురం నేడు వీరగున్నమ్మపురంలో హైస్కూలులో 1973-74 వరకు పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు అపురూపంగా కలుసుకున్నారు. ఒకరిని ఒకరు పలకరించుకుంటూ పాతజ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల సహకరించడంలో అంతా ఒక చోట కలవడానికి సాధ్యపడింది. పూర్వపు విద్యార్థులంతా కుటుంబ యోగక్షేమలు పలకరింపులతో ఆనందం వ్యక్తం చేశారు. విశ్రాంతి హింది ఉపాధ్యాయుడు ఆదినారాయణకు పుష్ప గుచ్ఛాలు అందజేసి దుశాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఐటీఐ రిటైర్డ్ ప్రిన్సిపాల్ బి.కూర్మారావు బీజేపీ నాయకుడు ప్రధాన మన్మధరావు, రిటైర్డ్ ఏఎస్ఐ ఎం.ప్రకాశరావు, రిటైర్డ్ లెక్చరర్ సనపల కామేశ్వరరావు, రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ ఎ.వెంకటరావు, ఎ. రామారావు, ఎం.లోకనాథం, విశ్రాంతి విద్యుత్ శాఖ ఎల్ఐ బి.వి.రమణ, తెలుకల లక్ష్మీనారాయణ, ఎల్.ధర్మారావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## బహుభాషా నాటకోత్సవాలకు మందస కళాకారులు

### -బరంపురంలో 'కన్నీటి బ్రతుకు' నాటక ప్రదర్శన

**మందస, డిసెంబరు 15(వార్త):** బహుభాషా నాటకోత్సవాలకు మందస కళాకారులు పయనమయ్యారు. వివిధ గ్రామాలకు చెందిన కళాకారులు ఈ నాటకోత్సవాల్లో పాల్గొననున్నారు. బహుభాషా నాటకోత్సవాలు-2025 ఒడిషా రాష్ట్రంలోని గంజాం జిల్లా బరంపురంలోని గంజాం కళాపరిషత్ హాలులో ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఈ నాటకోత్సవాలు జరుగనున్నాయని ప్రముఖ సినీ నటుడు, జానపద కళాకారుడు డాక్టర్ కుమార్ నాయక్ చెప్పారు. ఈ పోటీల్లో మందసకు చెందిన కళాకారులు కన్నీటి బ్రతుకు అనే సాంఘిక నాటకం ప్రదర్శించ నున్నారు. ఆంధ్రప్రదేశ్ తరపున 'కన్నీటి బ్రతుకు' అనే సాంఘిక నాటకం ఈనెల 17న ప్రదర్శనకు ఎంపికైందని కుమార్ నాయక్ తెలిపారు. ఏపీ నుండి శ్రీకాకుళం జిల్లా మందసకు చెందిన సుహాని క్రియేషన్ బ్యానర్ పై సురేష్ హాస్పిటల్ నిర్వహణ సారధ్యములో డాక్టర్ తిరుపతిసాహూ స్వీయ రచన, దర్శకత్వంలో నాటిక ప్రదర్శింపబడుతుందన్నారు. నటీనటులుగా నల్ల నీలకంఠం, నల్ల గోవిందరాజు, డాక్టర్ నల్ల సురేష్ చౌదరి, డాక్టర్ నల్ల తిరుపతి సాహూ, డాక్టర్ కుమార్ నాయక్, దీపక్ ప్రధాన్, సుజాత, నల్ల రజిని నాహక్ నటీనటులుగా నటిస్తున్నారు. సహదర్శకులుగా నల్ల నాగేశ్వరరావు, సంగీత దర్శకునిగా రమేష్ చంద్రస్వామి, పర్యవేక్షకుడిగా కురాగౌడు వ్యవహరిస్తున్నారని డాక్టర్ కుమార్ నాయక్ తెలిపారు.



## సంచార పుస్తకాలయం ప్రారంభం



**నరసన్నపేట, డిసెంబరు 15(వార్త):** లో విశాలాంధ్ర సంస్థ ఏర్పాటు చేసిన సంచార పుస్తకాలయాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ బలగమురళి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాలాంధ్ర సంస్థ ఒక విజ్ఞాన నిలయంగా సమాజంలో కీలక పాత్ర పోషిస్తోందని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పుస్తకాలు చదవడం ద్వారా మేధోశక్తి పెంపొందడంతో పాటు వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే పుస్తక పఠనం అత్యంత అవసరమని హితవు పలికారు. డిజిటల్ యుగంలో యువత మొబైల్ ఫోన్లకే పరిమితమవకుండా పుస్తకాల వైపు దృష్టి సారించాలని సూచించారు. ఎంతోమంది మహానుభావులు పుస్తక పఠనంతోనే గొప్ప వ్యక్తులుగా ఎదిగారని గుర్తుచేశారు. పిల్లల నుంచి పెద్దల వరకు అన్ని వర్గాల వారికి ఉపయోగపడే పుస్తకాలను ఒకే చోట అందుబాటులోకి తీసుకువచ్చిన విశాలాంధ్ర సంస్థ సేవలు అభినందనీయమని కొనియాడారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ నరసన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొన్న శ్రీనివాస్, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ రవిబాబు, సిబ్బంది కిరణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## భార్యను చంపిన భర్తకు యావజ్జీవ శిక్ష

**సోంపేట, డిసెంబరు 15(వార్త):** సోంపేట మండలం జింకిభద్ర గ్రామంలో షావుకారి డిల్లేశ్వరరావు అతని భార్య రత్నాలను గొడ్డలితో కొట్టి చంపిన కేసులో సాక్షాదారాలు రుజువు కావడంతో ముద్దాయి డిల్లేశ్వరరావుకు జిల్లా ఆరవ అదనపు కోర్టు న్యాయమూర్తి కోడూరి కిషోర్ బాబు యావత్ జీవ శిక్షను విధించారు. ఈ మేరకు సోమవారం తీర్పు వెలువడినట్లు సిఐ బి మంగరాజు తెలిపారు. జీవిత ఖైదు తో పాటు వెయ్యి రూపాయల జరిమానా కూడా విధించారు. జరిమానా చెల్లించని ఎడల మరో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దు వ్వ జగన్ నాయకులు కేసును వాదించారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం

**నరసన్నపేట, డిసెంబరు 15(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమర జీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ లత ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డిసెంబర్ 15న అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ఆత్మార్పణ ఫలితంగానే తెలుగు రాష్ట్రం ఆవిర్భవించిందని గుర్తు చేశారు. తమిళుల అపహేళనను, చిన్నచూపును తట్టుకోలేక అమరజీవి చేపట్టిన నిరాహార దీక్ష భాషా ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు దారితీసిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొని అమరజీవి సేవలను స్మరించుకున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## దివ్యాంగులకు ఏడు వరాలు ప్రకటించడంపై హర్షం



**ఎల్ఎన్ పేట, డిసెంబరు 15(వార్త):** దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు ఏడు వరాలను ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయస్వామిలకు సక్షం జిల్లా కన్వీనర్, దివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర లయన్ డా?ఎంకె మిత్రో పత్రికా ప్రకటన ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయులు బదిలీ మరియు ప్రమోషన్లలో తీవ్ర వైకల్యం ఉన్న వారికి మినహాయింపు, వారు కోరుకున్న స్థానంలో ఉండే విధంగా అవకాశం కల్పించాలని కోరారు.

ఈయనతో పాటు దివ్యాంగ సంఘ నాయకులు ఎం.భాస్కరరావు, ఎ. రమా, గణపతి, శైలజ, అప్పలస్వామి, ముకుంద, అప్పలనాయుడు, బి.శ్రీను, జ్యోతి, జనార్ధనరావు, చిన్నారావు, సత్యన్నారాయణ,గణ తదితరులు పాల్గొన్నారు.

# కోటి సంతకాల ర్యాలీ విజయవంతం

### -పోలీస్ ఆంక్షలను లెక్కచేయని వైసీపీ శ్రేణులు
### -ప్రజా స్వరం ఆపితే రాజకీయ తుఫాన్ తప్పదు
### - యువ నేత డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య



**నరసన్నపేట, డిసెంబరు 15(వార్త):** కోటి సంతకాల ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసు యంత్రాంగం ఎక్కడికక్కడ అడ్డంకులు సృష్టించినప్పటికీ, వాటన్నింటినీ అధిగమిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్వహించిన భారీ ర్యాలీ సూపర్ సక్సెస్‌గా నిలిచింది. అడ్డంకులను లెక్కచేయకుండా వందలాది వాహనాలతో రోడ్లపైకి వచ్చిన జనసంద్రం, పాలకుల నిర్ణయాలపై పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనంగా మారింది. యువ నేత డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య ఒక్క పిలుపుతో పార్టీ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో రోడ్లపైకి రావడం నరసన్నపేట రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. నరసన్నపేట నుంచి శ్రీకాకుళం వరకు చేపట్టిన కోటి సంతకాల ర్యాలీని నిలువరించేందుకు పోలీసు యంత్రాంగం చేసిన ప్రయత్నాలు పార్టీ శ్రేణుల మొక్కవోని ధైర్యం ముందు విఫలమయ్యాయి. సుమారు 300 బైకులు, 100 కార్లు, ఆటోలతో వేలాదిమంది కార్యకర్తలు, అభిమానులు ర్యాలీలో పాల్గొని జాతీయ రహదారిని కమ్మేశారు. ఫలితంగా పలుచోట్ల ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి శ్రీకాకుళం నగరం దద్దరిల్లింది. ఎక్కడికక్కడ ఆపేందుకు చేసిన ప్రయత్నాల మధ్య కూడా ర్యాలీ ముందుకు సాగడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నరసన్నపేట నియోజకవర్గంలో ఉన్న బలాన్ని మరోసారి చాటిచెప్పింది. ప్రజా సమస్యలపై గొంతెత్తితే అణచివేతే సమాధానమన్న ధోరణి కొనసాగితే, రానున్న రోజుల్లో ఉద్యమాలు మరింత ఉధృతమయ్యే అవకాశముందని, ఈ ర్యాలీ ఒక పార్టీ కార్యక్రమం మాత్రమే కాకుండా, ప్రజల్లో నానుతున్న అసహనానికి ప్రతిబింబమని,ప్రజల ఆగ్రహాన్ని, కార్యకర్తల ఉత్సాహాన్ని నిర్లక్ష్యం చేస్తే అది రాజకీయ సునామీగా మారుతుందనే సంకేతాన్ని ఈ ర్యాలీ ఇచ్చింది అని ధర్మాన కృష్ణదాస్ అన్నరు. ఇకనైనా పాలకులు ప్రజా స్వరాన్ని పట్టించుకుని, ప్రజాస్వామ్య పద్ధతుల్లో సమస్యలకు పరిష్కారం చూపకపోతే, ఇలాంటి ర్యాలీలు మరింత బలంగా రూపుదిద్దుకుంటాయని ఈ సంఘటన స్పష్టమైన సంకేతంగా మారిందని వైసిపి నాయకులు అన్నారు.

## అమరజీవికి నివాళులర్పించిన శిరీష



**పలాస, డిసెంబరు 15(వార్త):** అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పలాస మండలం బ్రాహ్మణతర్ల హైస్కూల్ లో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మా గాంధీ సిద్ధాంతాల ప్రభావంతో భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని ఉప్పు సత్యాగ్రహంలో, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ధీరోదాత్తుడు ఆయన అని కొనియాడారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు తన ప్రాణత్యాగంతో నాంది పలికిన ఆ మహనీయునికి నివాళి అర్పించారు.1952 అక్టోబర్ 19న మద్రాసులో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోసం నిరాహార దీక్ష ప్రారంభించారు. ప్రజల అలజడి రేపి, ఆమరణం చెందిన తర్వాత 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. గాంధీజీ ఆయన అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ పీరుకట్ల విఠల్, టిడిపి నేతలు తమ్మినేని గంగారం, దువ్వాడ సంతోష్ నాయుడు, పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయండి



**పలాస, డిసెంబరు 15 (వార్త):** విశాఖపట్నంలో జరగనున్న సీఐటీయూ అఖిలభారత 18 వ మహాసభలు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి యన్ గణపతి సోమవారం పిలుపునిచ్చారు. మహాసభలు సన్నాహక చూచికగా వాడ వాడలా ఎర్ర జండాలు ఎగరేయాలని రాష్ట్ర సీఐటీయూ పిలుపు మేరకు పలు చోట్ల సీఐటీయూ ఆధ్వర్యంలో జండా ఆవిష్కరణలు చేశారు. కార్మిక వర్గ పోరాటాల సారథి సీఐటీయూ మహాసభల సందర్బంగా జనవరి 4 న జరిగే కార్మిక మహా ప్రదర్శన, బహిరంగ సభలకు యావత్ కార్మిక వర్గం కదలాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అనుబంధ కార్మిక సంఘాల ప్రతినిధులు యం లావణ్య, జి జ్యోతి, యన్ ఢిల్లేశ్వరి, కె సుహాసిని, సబితా పాత్రో, పి మీన జ్యోతి మహంతి, కె ఆనంద్, కె సురేష్, అప్పారావు,టోక్క శ్రీనివాసరావు, రోకల్ల జోగారావు, కామిటి గోవింద్, ఉర్నాన మోహన్, టి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆంగ్ల భాష నైపుణ్యాల పెంపునకు స్పెల్ బీ పరీక్షలు



**నరసన్నపేట, డిసెంబరు 15(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు పెంచే లక్ష్యంతో స్పెల్ బీ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎంఈఓ పేడాడ దాలినాయుడు తెలిపారు. సోమవారం నరసన్నపేటలోని పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో జరుగుతున్న స్పెల్ బీ పోటీలను ఆయన పరిశీలించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల్లో ఆంగ్ల భాష పట్ల మక్కువ పెంచడంతో పాటు సరైన ఉచ్చారణ, పదాల అర్థాలను తెలుసుకునేలా ఈ పోటీలు ఉపయోగపడుతున్నాయని అన్నారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతూ భాషా నైపుణ్యాలను మెరుగుపరచడంలో స్పెల్ బీ పరీక్షలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా వారి ప్రతిభను వెలికితీయాలని ఎంఈఓ సూచించారు.

## కార్యకర్త కుటుంబానికి అండగా శేఖర్



**సోంపేట, డిసెంబరు 15(వార్త):** కంచిలి లో ఇటీవల గుండెపోటుతో వైసీపీ కార్యకర్త బతకల బిజు అనే యువకుడు హఠాత్తుగా మృతి చెందాడు. పార్టీకి అంకితభావం గల కార్యకర్త అలాగే పేద కుటుంబానికి చెందిన వాడు కావడంతో స్థానిక వైసిపి సీనియర్ నాయకుడు కొత్తకోట శేఖర్ బాబు ఆ కుటుంబానికి అండగా నిలిచి పెద్దకర్మను తానే నిర్వహించడం విశేషం. నిజమైన కార్యకర్తను గుర్తించి అటువంటి వారికి సేవ చేయడంలో శేఖర్ బాబు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారు. విజు పెద్దకర్మకు హాజరైన పార్టీ నేతలు పైలు దేవదాసు రెడ్డి, సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి తదితరులు తోపాటు మిగతా కార్యకర్తలు శేఖర్ బాబును అభినందించారు.

## విద్యుత్ షాక్‌కు గురై లైన్‌మన్‌కి గాయాలు



**నరసన్నపేట, డిసెంబరు 15(వార్త):** నరసన్నపేట మండలం బొరిగివలస గ్రామంలో విద్యుత్ పనులు నిర్వహిస్తున్న లైన్మెన్ జయరాజ్ ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై గాయపడిన ఘటన సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో చోటుచేసుకుంది. విధుల్లో భాగంగా విద్యుత్ లైన్ పనులు చేపడుతున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించినట్లు సమాచారం. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి జయరాజ్‌ను హుటాహుటిన సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స అందుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనకు గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉండగా, సంబంధిత అధికారులు విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

## పల్స్ పోలియోని విజయవంతం చేయాలి

**జలుమూరు, డిసెంబరు 15(వార్త):** రాష్ట్ర వైద్యశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని వైద్యాధికారిణి సంధ్యారాణి తెలిపారు. సోమవారం జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిర్దేశించిన కేంద్రాలలో తప్పనిసరిగా 0 నుంచి 5 ఏళ్ల లోపు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ఎలాంటి చిన్నారి కూడా మిస్సవకుండా ఇంటింటి సర్వేలు నిర్వహిస్తూ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైతే సమాజం పోలియో రహితంగా మారుతుందని పేర్కొంటూ, సంబంధిత సిబ్బంది అందరూ పూర్తి బాధ్యతతో పనిచేయాలని వైద్యాధికారిణి సూచించారు.



## ఈదుపురం చర్చి 10వ వార్షికోత్సవం



**ఇచ్ఛాపురం, డిసెంబరు 15(వార్త):** ఈదుపురం ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి లో 10 వ వార్షికోత్సవం మరియు సెమి క్రిస్మస్ వేడుకలు. డి. ఏలీయా ఆధ్వర్యంలో జరిగాయి.ముఖ్య ప్రసంగికులు బిషప్. డా. దానియేలు పాల్( రాజమండ్రి) అద్భుతమైన క్రిస్టమస్ వర్తమానము అందించారు. ముఖ్య అతిథిగా అధ్యక్షులు గా బిషప్. డా. కొత్తపల్లి అబ్రహం( సోంపేట) విచ్చేచారు, మరో ముఖ్య అతిథిగా డా. ప్రత్తి అన్వేష్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి శుభాకాంక్షలు తెలియ జేశారు. . భీమ్ బెహరా , శేఖర్ పాస్టర్, మాలకి , మురళి పాస్టర్, బాబులు పాస్టర్, .లుక్ ఆనంద్ , ఎస్. సుధాకర్ , ఇంకా అనేకమంది దైవ సేవకులు, పెద్దలు ఎక్కువగా పాల్గొన్నారు .క్రైస్తవ విశ్వాసుకులు ఎక్కువగా పాల్గొన్నారు, కొరియోగ్రఫీ, క్యాండిల్ సర్వీస్, కేక్ కటింగ్ జరిగించారు, అద్భుమైన స్తుతి ఆరాధన చేశారు, ముగింపులో 40 మంది దైవ సేవకులకు క్రిస్మస్ బహుమతులు అందించారు , క్రిస్మస్ వేడుకలు ప్రార్థన పూర్వకముగా ఘనము గా ముగించారు.

## అంగన్వాడీ కేంద్రాలకు ఆధునిక సాంకేతిక బలం




**పోలాకి, డిసెంబరు 15(వార్త):** రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత వేగవంతంగా, సమర్థవంతంగా పనిచేయించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు నూతనంగా 5జీ సెల్‌ఫోన్లను అందజేస్తోందని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి తెలిపారు. పోలాకి మండలం మబగాం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్లను అందజేశారు. జలుమూరు, సారవకోట మండలాలకు చెందిన 193 మంది అంగన్వాడీ కార్యకర్తలకు ఎమ్మెల్యే సెల్‌ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులకు నాణ్యమైన సేవలు వేగంగా అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆధునిక పరికరాల వినియోగంతో సేవల నాణ్యతతో పాటు సమయపాలన కూడా మెరుగుపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా పీఓ శోభారాణి మాట్లాడుతూ, నరసన్నపేట మరియు పోలాకి మండలాలకు సంబంధించిన 249 సెల్‌ఫోన్లను త్వరలో అంగన్వాడీ కార్యకర్తలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సారవకోట సిడిపిఓ సిహెచ్ వంశీ ప్రియ, పర్యవేక్షణ అధికారులు సుజాత, సీతారత్నం, మనోహరీ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమం ద్వారా తమ పనితీరు మరింత మెరుగుపడుతుందని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

## క్రమశిక్షణకు ప్రతిరూపం.. ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు ఎంకే దాస్

**నరసన్నపేట, డిసెంబరు 15(వార్త):** శ్రీముఖలింగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎంకే దాస్ మాస్టారు క్రమశిక్షణకు, అంకితభావానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అక్కడ చదివిన పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రశంసించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన '100 యాక్షన్ ప్లాన్' కార్యక్రమంలో భాగంగా, పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంలో ఎటువంటి రాజీ లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. తరగతి గదిలో క్షణం కూడా విశ్రాంతి తీసుకోకుండా విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేసే పట్టుదల ఆయనలో స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. సొంత ఊరు శ్రీముఖలింగం, సొంత పాఠశాలపై ఉన్న మమకారంతో పదవీ విరమణకు సమీపంలో ఉన్నప్పటికీ, పదో తరగతి విద్యార్థుల్లో ఇంగ్లీష్ విషయంపై పట్టు పెంపొందించేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారు. విద్యార్థుల్లో ఆయన పట్ల భయం కాదు గౌరవం, క్రమశిక్షణ కలిసిన ఆత్మీయత ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. ఇదే పాఠశాలలో కొంతకాలం ఎఫ్ఏసీ ప్రధానోపాధ్యాయుడిగా కూడా సేవలందించి మంచి పేరు తెచ్చుకున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తు చేశారు. ఉద్యోగ ధర్మంలో సమయపాలన, నిబద్ధతే ప్రధాన లక్ష్యంగా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు.



## క్రమశిక్షణతో లక్ష్యాన్ని సాధించాలి



**జలుమూరు, డిసెంబరు 15(వార్త):** రాణ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈఓ బమ్మిడి మాధవరావు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి ఒక స్పష్టమైన లక్ష్యంతో విద్యను అవలంబించాల్సిన అవసరం ఉందని తెలిపారు. క్రమశిక్షణే విద్యలో విజయానికి మౌలికాధారమని పేర్కొన్నారు. తరగతి గదుల్లో అధ్యాపకులు బోధిస్తున్న పాఠాలను విద్యార్థులు క్షుణ్ణంగా వినిపించి అవగాహన చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు కూడా పాఠ్యబోధనలో నాణ్యతను పెంపొందిస్తూ, విద్యార్థుల్లో ఆసక్తిని కలిగించే విధంగా బోధించాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది వేయడమే ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని ఎంఈఓ స్పష్టం చేశారు.

## కలమటపై కేసు కొట్టివేత



**కొత్తూరు, డిసెంబరు 15(వార్త):** పాతపట్నం నియోజకవర్గ మాజీ తేదేపా ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి, ఆయన అనుచరుల మీద గత వైకాపా పెట్టిన అక్రమ కేసులో ఊరట లభించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో (2019-2024) అక్రమంగా నమోదు చేయబడ్డ కేసుల నుంచి వరుసగా ఊరట పొందుతున్న ఈ తరుణంలో, తాజాగా హిరమండలం జెడ్పీటీసీ ఉపఎన్నికల సమయంలో నమోదు చేసిన కేసును కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సోమవారం కొట్టివేసింది.కోర్టు ఈ కేసులో ఆరోపణలు నిరాధారమని పేర్కొంది. ఈ తీర్పుతో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి అనుచరులు చట్టపరమైన ఉపశమనం పొందారు.ఈ కేసులో ఊరట పొందిన వారిలో హిరమండలం మాజీ మండల అధ్యక్షుడు చెట్టు శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి కొల్లి నాగరాజు, మాకవరం సర్పంచ్ ప్రతినిధి గార నారాయణరావు, బర్రి సురేష్, లోలుగు ఉత్తేజ్, తూలుగు వినోద్, కొప్పారోతు సింహాచలం తదితరులు ఉన్నారు.గతంలో వైకాపా రంగులు వేయడాన్ని అడ్డుకున్నారన్న కారణంతో దాఖలైన మరో కేసులోనూ వీరికి కోర్టు నుంచి ఊరట లభించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ తీర్పుతో న్యాయమే గెలిచిందని, తాము న్యాయపరంగా నిజం నిరూపించుకున్నామన్న ఆనందం అనుచరుల్లో వ్యక్తమవుతోంది.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కూటమి ప్రభుత్వం విద్యకే పెద్ద పీట



**పలాస, డిసెంబరు 15(వార్త):** కూటమి ప్రభుత్వం విద్యకే పెద్ద పీట వస్తుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సోమవారం పలాస మండలం బ్రాహ్మణతర్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 69,30,000 రూపాయలు వ్యయం తో నూతన ల్యాబ్ భవనం నకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థ కు పెద్ద పీఠ వేస్తూ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో దూసుకు పోతుందని తెలిపారు. గతంలోఈ గ్రామ పాఠశాలకు సి ఎస్ ఆర్ నిధులు ద్వారా ఆర్వో ప్లాంట్ ను మంజూరు చేయడం జరిగిందని, మా నాన్న గౌతు శివాజీ ఆధ్వర్యంలో అదనపు భవనం, కాంపౌండ్ వాల్ మంజూరు చేసి నిర్మించడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో ఈ పాఠశాలకు ఈ గ్రామ అభివృద్ధికి నా వంతు నేను మరింత కృషి చేస్తానని చెప్పారు. వీరితో పాటు పలాస మండల అధ్యక్షులు, కార్యదర్శులు, పలాస మండల ముఖ్య నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల సాధనకు సిఐటియు నిరంతర పోరాటం




**కొత్తూరు, డిసెంబరు 15(వార్త):** ఈ నెల 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు 18వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ పనస రమేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొత్తూరు మండల కేంద్రంలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు.పనస రమేష్ మాట్లాడుతూ, సిఐటియు చరిత్రను, కార్మికుల పట్ల ఆ సంఘం యొక్క అంకితభావాన్ని వివరించారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో 1970 మే 30న కలకత్తాలో సిఐటియు కార్మిక హక్కుల సాధన కోసం స్థాపించబడిందని తెలిపారు. 'ఐక్యత%-%పోరాటం' అనే నినాదంతో శ్రమజీవుల ప్రయోజనాలకోసం రాజీలేని పోరాటం కొనసాగిస్తున్నదని ఉద్ఘాటించారు. దేశంలో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన ఏకైక సంఘం సిఐటియు మాత్రమేనని ఆయన గుర్తు చేశారు.ప్రస్తుతం ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలకు అలాగే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సిఐటియు పోరాటం సాగిస్తోందని చెప్పారు. పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని హక్కు రక్షణ కోసం, సోషలిజం లక్ష్య సాధనలో ఎర్రజెండా అండగా సిఐటియు నిరంతరం కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిర్ల ప్రసాద్, నిమ్మక అప్పన్న, యస్. గౌరమ్మ, శ్రీల్, నిర్మల, సుధ, రమేష్, సింహాచలం, శంకర్, ఆనంద్, రాము, లక్ష్మీ తదితర కార్మిక సంఘ నేతలు పాల్గొన్నారు.

## దివ్యాంగ చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ఫిజియోథెరపీ కీలకం



**నరసన్నపేట, డిసెంబరు 15(వార్త):** దివ్యాంగ చిన్నారులకు శారీరక, మానసిక అభివృద్ధి కోసం ఫిజియోథెరపీ తప్పనిసరిగా అవసరమని ఫిజియోథెరపిస్ట్ శంకర్ తెలిపారు. సోమవారం నరసన్నపేటలోని పీఎం శ్రీ పాఠశాలలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రంలో ఎంఈఓ పేడాడ దాలినాయుడు ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పేడాడ దాలినాయుడు మాట్లాడుతూ, దివ్యాంగ చిన్నారుల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పాఠశాలలో మాత్రమే కాకుండా ఇంటి వద్ద కూడా ప్రతిరోజూ ఫిజియోథెరపీ వ్యాయామాలను కొనసాగించాలని సూచించారు. భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు దివ్యాంగ చిన్నారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా, వారి రోజువారీ జీవితంలో స్వావలంబన సాధించేలా చేస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## స్కూల్ గేమ్స్‌లో విజేతలకు అభినందనలు



**నరసన్నపేట, డిసెంబరు 15(వార్త):** నరసన్నపేట మండలం బాడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల పోలాకి మండలం మబగాం జడ్పీ పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. పలు క్రీడా పోటీల్లో విజయాలు సాధించి పాఠశాలకు గౌరవాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం. జగదీశ్, వ్యాయామ ఉపాధ్యాయురాలు అరుణకుమారి, విద్యా కమిటీ ఛైర్మన్ శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించి ప్రోత్సహించారు. క్రీడల్లో సాధించిన ఈ విజయాలు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకునేలా దోహదపడతాయని వారు తెలిపారు.

## విద్యుత్ పొదుపు లక్ష్యం కావాలి

*** ఏపిఈపీడిసియల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి**

**శ్రీకాకుళం, డిసెంబర్ 15(వార్త):** ఒక యూనిట్ విద్యుత్ పొదుపు రెండు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తితో సమానమని ఏపీఈపీడిసియల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి అన్నారు. ఇందన పొదుపు వారోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా పరిషత్ నుండి శ్రీకాకుళం నగరపాలక సంస్థ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఈనెల14 నుండి 20 వరకు జిల్లాలో విద్యుత్ శాఖ ఆధ్వర్యములో నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతుందన్నారు. విద్యుత్ పొదుపు లక్ష్యంగా కృషి చేయాలని, భావితరాల దృష్ట్యా విద్యుత్తును ఆదా చేయాని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తముగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సోలార్ రూఫ్ టాప్స్‌ను తీసుకునేందుకు ముందుకు రావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, ఈఈ టెక్నికల్ జి సురేష్ కుమార్, ఈఈ శ్రీకాకుళం పి యోగేశ్వం రావు, డిఈఈ శ్రీకాకుళం సిహెచ్ వెంకటేశ్వరరావు, ఏఈఈ జె.సురేష్ కుమార్, కె. జైరాము, విద్యుత్ సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.




# నడకతో జీవన విధానంలో మార్పు

**-వాకర్స్ గవర్నర్ కాన్ఫరెన్స్‌లో వక్తలు**

**-మురళీధర్ సేవలను ప్రశంసించిన నేతలు**

**-వాకర్స్ క్లబ్‌లకు అవార్డులు**

**శ్రీకాకుళం, డిసెంబరు 15(వార్త):** నడక ద్వారా ప్రతి మనిషి జీవన విధానంలో మార్పు చేసుకొనేందుకు అవకాశం ఉంటుందని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 102 జిల్లా గవర్నర్స్ కాన్ఫరెన్స్-2025 అరసవల్లిలోని ఎల్ఎన్ గ్రీన్స్ కన్వెన్షన్ హాల్‌లో ఆ సంస్థ జిల్లా గవర్నర్ కొంక్యాన మురళీధర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ వాకింగ్ చేయడం ద్వారా ఆరోగ్యం మెరుగుపర్చుకోవడంతో పాటు వాకర్స్ సంస్థ ద్వారా చేపట్టే కార్యక్రమాలు క్లబ్ ప్రతినిధులకు సంతృప్తినిస్తాయన్నారు. యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడంలో వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళీధర్ అందించిన సేవలను ప్రశంసించారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ నిరంతరం సేవలందించే వ్యక్తులుగా కొంక్యాన కుటుంబీకులకు పేరుందని, ఏ సంస్థలో పనిచేసినా ఆ సంస్థ పురోభివృద్ధికి కృషి చేస్తారన్నారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి మాట్లాడుతూ ఖర్చు లేకుండా ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకొనేందుకు నడక దోహదం చేస్తుందన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలోనే కాకుండా జిల్లాలో సేవా కార్యక్రమాలు నిర్వహించే కొంక్యాన కుటుంబీకులను ప్రశంసించారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ కొంక్యాన గోవిందరాజులు పేరిట ట్రస్టు ద్వారా నిరంతరం కార్యక్రమాలు చేపడుతూ వివిధ సేవా సంస్థల్లో కూడా చురుకైన పాత్ర మురళీధర్ నిర్వహిస్తున్నారన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి మాట్లాడుతూ మంచి సమాజం కోసం పనిచేయడంలో కొంక్యాన మురళీధర్ ముందుంటారని, ఇతర సంస్థల్లో కూడా అదే స్థాయిలో పనిచేస్తారన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు డాక్టర్ నాగేంద్ర మాట్లాడుతూ వాకర్స్ సంస్థలో సుదీర్ఘకాలం ఎన్నో సేవలందిస్తూ మురళీధర్ ఉత్తరాంధ్ర జిల్లాల్లో వాకర్స్ క్లబ్‌లను పటిష్టం చేసేందుకు చేసిన కృషిని ప్రశంసించారు. కొంక్యాన కుటుంబీకులకు ఉన్న పేరు ప్రఖ్యాతలు ప్రజా ప్రతినిధుల ప్రసంగాల రూపంలో తెలుసుకోగలిగామన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ (ఎలక్ట్) పి.జి.గుప్త మాట్లాడుతూ వాకర్స్ ఉద్యమం బలోపేతం చేసేందుకు తాము చేస్తున్న కృషిలో మురళీధర్ సహకారం ఎంతో ఉందన్నారు. ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం మాట్లాడుతూ వివిధ సంస్థల్లో పనిచేస్తూ సమాజహిత కార్యక్రమాలు చేపట్టడంలో మురళీధర్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ అటవీ పర్యావరణ సంస్థల డైరెక్టర్ గేదెల చైతన్య మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలకు పైగా మురళీధర్ విద్య, వైద్యం, ఇతర సామాజిక సేవలు చేస్తూనే ఉన్నారన్నారు. ఐతం ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, జెమ్స్ కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మధుకర్ విలేకర్, వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ కర్రోతు సత్యం, పూర్వ గవర్నర్లు జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, కె.వి.రమణమూర్తి, ఎస్.ఎస్.ఎస్.ఎస్.రాజు, సుబ్బరాజు, కృష్ణంరాజు, ఏ.ఎస్.ప్రకాశరావు, కె.ఎర్రునాయుడు, ఎలెక్ట్ గవర్నర్ ఏ.తిరుపతిరావు, ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, ఆంధ్రప్రదేశ్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కొన్న వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ఆర్ ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ సూర శ్రీనివాసరావు, వాకర్స్ క్యాబినెట్ సెక్రటరీ సుగంధం సంజీవరావు, ట్రెజరర్ చదువుల బసవరాజు ప్రసంగించారు. తొలుత భారతీయ శాస్త్రీయ నృత్య ప్రదర్శనను ప్రముఖ నృత్య దర్శకురాలు



నాగకన్యక శ్రీనివాస్ నృత్య దర్శకత్వంలో సంధ్యాచందన ప్రదర్శించారు. డాక్టర్ లక్ష్మీనారాయణ ఆసుపత్రుల అధినేత, ప్రముఖ న్యూరోఫిజీషియన్ & సర్జన్ డాక్టర్ పైల లక్ష్మీనారయణ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నరాలకు సంబంధించిన వ్యాధులు, పరిష్కార మార్గాలు గురించి వివరించారు. సామాజిక సేవా కార్యక్రమాల కోసం బిహెచ్ఆర్‌సి ప్రతినిధులు డాక్టర్ ప్రభు, సౌజన్య, రౌతు సూర్యనారాయణ రూపొందించిన పోస్టర్‌ను అతిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంస్థల ప్రతినిధులు ఎస్.జోగినాయుడు, బి.వి.రవిశంకర్, గేదెల లక్ష్మీ, నల్లి ఆశాదీపిక, పాండ్రంకి మురళీకృష్ణ, డాక్టర్ నల్లి రవికుమార్, బహుదూర్ భాషా, కిల్లంశెట్టి కరుణ్‌కుమార్, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు హారికాప్రసాద్, బెందాళం వరలక్ష్మీ, తమ్మినేని ఉషారాణి, దుంపల నరేష్, రాజ్‌కుమార్, శాలిహుండాం సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు కోట సావిత్రమ్మ, కొన్న నరసింహమూర్తి, కొంక్యాన రాధాకృష్ణ, వెంకటరమణమ్మ, కొంక్యాన వేణుగోపాల్, మంగమ్మ, సరోజా, ఫల్గుణరావు, చైతన్య, కొంక్యాన శివశంకర్, డాక్టర్ శిష్ణ మనోజ్‌కుమార్, డాక్టర్ మాధురి తదితరులు పాల్గొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన వివిధ క్లబ్‌లు ఏడాదికాలంలో నిర్వహించిన సేవలకు అవార్డులు, ప్రశంసాపత్రాలను ఏవీపీ డాక్టర్ నాగేంద్ర, గవర్నర్ కొంక్యాన మురళీధర్ చేతుల మీదుగా అందించారు.






## పలాసను ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

**-ఎమ్మెల్యే శిరీష**



**పలాస, డిసెంబరు 15(వార్త):** పలాసను ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. పలాస కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధి 20 వార్డ్ శివాజీ నగర్ కాలనీలో రూ. 5.5 లక్షల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం ఎమ్మెల్యే గౌతు శిరీష శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో పలాసను ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుతామని తెలిపారు. పలాసను మోడల్ మున్సిపాలిటీగా మార్చడానికి ఆర్థిక అభివృద్ధి, సుపరిపాలన, ప్రజా భద్రతపై దృష్టి పెట్టమని చెప్పారు. స్థానిక సంఘాలు, పలాస మున్సిపల్ ఛైర్మన్ సమన్వయం చేసి 2047 విజన్ ప్రకారం నిధులు సేకరించి, మీ సామాజిక సేవా ఆసక్తి ప్రకారం ప్రజల్లో అవగాహన పెంచి కలిసి పనిచేయాలని స్థానిక నేతలకు సూచించారు. ఏ ప్రాంతం కైనా రహదారులు అభివృద్ధి చెందితే ఆ ప్రాంతం అభివృద్ధి చెందినట్లేనని ఆమె తెలిపారు. రహదారి సౌకర్యం ఉంటేనే ఆ ప్రాంతాల నివసించే ప్రజలు మనో ధైర్యంగా ఉంటారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు, మునిసిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు, జిల్లా గ్రంధాలయం ఛైర్మన్ పీరుకట్ల విఠల్, పలాస ఏఎంసీ ఛైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి నేతలు గాలి కృష్ణారావు, లోడగల కామేష్, జి సూర్యనారాయణ, సప్ప నవీన్,కెళ్ళి ఆనంద్, పి రవి, బెల్లాల నారాయణరావు, ధర్మాన గణపతి, మార్పు శ్యామ్, మార్పు కాళీ, వాంపల్లి అప్పారావు, సుధాకర్, ప్రదీప్ పండ, శేఖర్, ఏఈ ప్రకాష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు




**పలాస, డిసెంబరు 15(వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు డిసెంబర్ 14-12-2025 నుండి 20-12-2025 వరకు పలాస డివిజన్ విద్యుత్ శాఖ (ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏపీఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నట్లు పలాస డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్) గుళ్ల యజ్ఞేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా డిసెంబరు 15 పలాస డివిజన్ విద్యుత్ కార్యాలయం నుండి కాశీబుగ్గ బస్టాండ్ వరకు విద్యుత్ పొదుపు అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ ర్యాలీలో విద్యుత్ ఏఈలు విగ్నేశ్వర రావు, వివేకానంద, సురేష్, రమణ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు త్యాగం నేటి తరానికి స్ఫూర్తి




**పాతపట్నం, డిసెంబర్ 15 (వార్త):** ఆంధ్ర రాష్ట్ర అవతరణకు తన ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పాతపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రా రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుడన్నారు. పొట్టి శ్రీరాములు పోరాట స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తి అని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, రాష్ట్ర అభివృద్ధే పరమావధిగా పనిచేసినప్పుడే వారి ఆశయాలకు నిజమైన నివాళి అర్పించినట్టవుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో పాతపట్నం మండల అధ్యక్షులతో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాడ లేని శిక్షణ..!

### నరసన్నపేటలో నిలిచిపోయిన కుట్టు శిక్షణ కేంద్రం

**- మూలకు చేరిన మిషన్లు**



**నరసన్నపేట, డిసెంబరు 15(వార్త):** మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా పలు పథకాలను రూపొందించింది. శిక్షణ పూర్తైన అనంతరం మహిళలకు కుట్టుమిషన్లు అందించి స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని భావించారు. ఈ క్రమంలో నరసన్నపేటలో కూడా మహిళల కోసం కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుని, 25 కుట్టు మిషన్లను ఏర్పాటు చేశారు. అయితే శిక్షణ తీసుకునేందుకు మహిళలు ముందుకు రాకపోవడంతో ఈ శిక్షణ కేంద్రం పూర్తిగా నిలిచిపోయింది. ప్రభుత్వం ఖర్చు చేసి పంపించిన కుట్టు మిషన్లు ప్రస్తుతం వినియోగం లేకుండా మూలకు చేరిపోయాయి. ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన పథకం కాగితాలకే పరిమితమైందని స్థానికులు విమర్శిస్తున్నారు. శిక్షణకు సరైన అవగాహన కల్పించకపోవడం, ప్రోత్సాహం లేకపోవడం, శిక్షణ నిర్వహణలో లోపాలే మహిళలు ముందుకు రాకపోవడానికి కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి, శిక్షణ కేంద్రాన్ని పునరుద్ధరించి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. లేకపోతే మహిళా సాధికారత కోసం రూపొందించిన ఈ పథకం "జాడ లేని శిక్షణ"గానే మిగిలిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## అక్షయ పాత్ర సేవలు ప్రశంసనీయం

*** ఎమ్మెల్యే కూన రవికుమార్**



**ఆమదాలవలస, డిసెంబర్ 15(వార్త):** పిల్లల ఆకలిని తీర్చి, పోషకాహారాన్ని అందించడంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ చేస్తున్న సేవలు ఎంతో ఉపయోగకరమని స్థానిక శాసన సభ్యులు, పి.యు.సి. ఛైర్మన్ కూన రవికుమార్ ప్రశంసించారు. ఆమదాలవలసలోని లక్ష్మి నగర్ పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో సోమవారం అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రారంభించిన ఉదయం పోషకాహార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం లక్ష్యం, తరగతులు ప్రారంభం కాకముందే విద్యార్థుల ఆకలిని తీర్చి, వారికి పోషకాహారాన్ని అందించడమేనన్నారు. ఉదయం అల్పాహారం లేకుండా పాఠశాలకు వస్తున్న పిల్లలను గుర్తించి, ఈ ఫౌండేషన్ వారంలో మూడు రోజులు చిరు ధాన్యాలతో చేసిన చెక్కి, వేరుశెనగలు, స్నాక్స్, ప్రోటీన్ బార్ వంటి బలవర్ధ కమైన ఆహారాన్ని అందించడానికి ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా ప్రారం భించిందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఉదయం అల్పా హారాన్ని ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ తమ్మినేని రవి, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత విద్యాసాగర్, మండల విద్యాశాఖ అధికారులు అప్పలరాముడు, టి.రాజు, ప్రధానోపాధ్యాయు రాలు పి.వీ.రమణమ్మ, అక్షయపాత్ర ఫౌండేషన్ రీజినల్ మేనేజర్ రామ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### కూరగాయల దుకాణ సముదాయం ప్రారంభం

ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలో రూ.39.65 లక్షల వ్యయంతో నిర్మించిన కూరగాయల దుకాణ సముదాయాన్ని ఎమ్మెల్యే కూన రవి కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తాము పండించిన కూరగాయలను నేరుగా మార్కెట్‌లో విక్రయించుకునేందుకు ఈ దుకాణ సముదాయం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కూరగాయల వ్యాపారులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546